క్లుప్తంగా

విద్యార్థులకు టై, బెల్ట్‌ల పంపిణీ



విద్యార్థులకు టై, బెల్ట్‌లను పంపిణీ చేస్తున్న తెడ్డు కృష్ణారావు

తుంగతుర్తి : మండల పరిధిలోని గొట్టిపర్తి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన తెడ్డు కృష్ణారావు ఉచితంగా టై, బెల్ట్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. టై, బెల్ట్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ ఉమర్, ఉపాధ్యాయులు విజయ్, ఫజల్, భానుప్రియ, మంగు, రాజు, లింగయ్య, కిరణ్, మమత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ అమీన్‌సింగ్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మద్దిరాల : మండల తహసీల్దార్ అమీన్‌సింగ్ ఉత్తమ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను రెవెన్యూ సిబ్బంది పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాలరాజ్, సీనియర్ అసిస్టెంట్ రామరావు, ఆర్‌ఐ, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

29న 'గంగెద్దు' పుస్తక పరిచయ కార్యక్రమం

తుంగతుర్తి : నల్లగొండలోని టీఎన్‌జీఓ కార్యాలయంలో ఆదివారం 'గంగెద్దు' కథా సంపుటి పుస్తక పరిచయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పుస్తక రచయిత మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు శీలం భద్రయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పుస్తక పరిచయ కార్యక్రమానికి ప్రధాన వక్తలుగా సుంకిరెడ్డి నారాయణరెడ్డి, తండు కృష్ణకౌండిన్య, భిక్షపతి, సాగర్ల సత్తయ్య తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. పుస్తక పరిచయ కార్యక్రమానికి సాహిత్యవేత్తలు, సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి



న్యూట్రిషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, డాక్టర్లు

అర్వపల్లి : ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఆరోగ్య నియమాలు పాటించాలని అర్వపల్లి శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, టీఆర్‌ఎస్ మండల నాయకుడు కనుకు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో న్యూట్రిషన్ సెంటర్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రతిరోజు శరీరానికి కావాల్సిన న్యూట్రిషన్‌ను తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆరోగ్య నియమాలపై డాక్టర్ చినపాక మణిరత్నం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సుబ్బు, ప్రవీణ్, రాజేష్, నాగు, విజయలక్ష్మి, గండమల్ల యల్లయ్య, వేణు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకు కాంగ్రెస్'ను విజయవంతం చేయాలి

అర్వపల్లి : హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా చేపట్టిన గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని కాసర్లపహాడ్‌లో పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, మేకల రాంబాబు, దిర్శనపు యాదయ్య, శేఖర్, లింగరాజు, నల్లకుంట్ల రవి, దస్తగిరి, మల్లయ్య, యల్లయ్య, వీరమల్లు, యుగేందర్, అరుణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ పైలెట్లకు సన్మానం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో 108 అంబులెన్స్ పైలెట్లుగా పనిచేస్తూ జిల్లా ఉత్తమ పైలెట్లుగా ఎంపికైన వల్లాల సత్యనారాయణ, కాసోజు శంకర్‌కు శుక్రవారం ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎస్‌డీ నజీరొద్దీన్, జిల్లా మేనేజర్ నగారి సోమేశ్వర్ ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సత్యనారాయణకు 5వ సారి, శంకర్‌కు రెండుసార్లు ఇప్పటికే ఉత్తమ పైలెట్లుగా అవార్డులు వచ్చినట్లు తెలిపారు.

రోడ్డు దాటాలంటేనే హడల్

- క్రాసింగ్‌ల వద్ద నిత్యం ప్రమాదాలు
- హెచ్చరిక బోర్డులు, స్టాపర్స్ ఏర్పాటు చేయాలని వాహనదారుల వినతి



తిరుమలగిరి మండల కేంద్రంలోని క్రాసింగ్

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రమాదాల నివారణకు ప్రభుత్వం జాతీయ రహదారిని ఆధునిక సాంకేతికతకు జోడించి విస్తరించింది. కానీ గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రాసింగ్‌ల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. క్రాసింగ్‌లు దాటాలంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. సూర్యాపేట, జనగామ ప్రధాన జాతీయ రహదారి (365బి) విస్తరించింది. ఈ జాతీయ రహదారిపై మున్సిపాలిటీ పరిధిలో 12 చోట్ల క్రాసింగ్‌లు ఉన్నాయి.మున్సిపాలిటీ పరిధిలోని నేషనల్ హైవేపై క్రాసింగ్‌లు చాలా ప్రమాదకరంగా మారాయి. నెల్లిబండ తండాకు వెళ్లే క్రాసింగ్ వద్ద ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టడంతో ఒక వ్యక్తి చనిపోయాడు. ప్రభుత్వ పాఠశాల ముందు ఉన్న క్రాసింగ్ వద్ద మరో ప్రమాదంలో కారును బైక్ ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. తిరుమలాహిల్స్ వెళ్లే దారిలో గతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఫాతిమా పాఠశాల వద్ద ఉన్న క్రాసింగ్ వద్ద గతంలో ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. ఇప్పటి వరకు ఈ క్రాసింగ్‌ల వద్ద గత సంవత్సరం నుంచి 25 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. ఈ క్రాసింగ్‌ల వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇన్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రాసింగ్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి లేదా స్టాపర్స్ ఏర్పాటు చేయాలి.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ప్రమాదాలు జరిగే స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అనవసరంగా ఉన్న కొన్ని క్రాసింగ్‌లను మూసి వేయాలి. ప్రజలకు క్రాసింగ్‌ల వద్ద స్టాఫర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలి.

- మోహన్, తిరుమలగిరి

ప్రమాదాలు జరగకుండా చూడాలి



సూర్యాపేట, జనగామ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఈ క్రాసింగ్‌లపై ప్రతిరోజు ఏదో ఒక చోట ప్రమాదం చోటు చేసుకుంటుంది. హైవే అధికారులు క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు జరుగకుండా సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. లేదా అండర్ పాస్ ఏర్పాటు చేయాలి.

- వెంకట్‌రెడ్డి, తిరుమలగిరి

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్స జనార్దన్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

తుంగతుర్తి : న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్స జనార్దన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బార్ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బార్ కౌన్సిల్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అనంతరం మొదటిసారిగా తుంగతుర్తికి వచ్చిన సందర్భంగా తుంగతుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే బార్ అసోసియేషన్ 2023 క్యాలెండర్‌ను ఆయన చేతులమీదుగా ఆవిష్కరించారు. సమావేశంవలో బార్ అసోసియేషన్ సభ్యులు కారింగుల వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, టి.మురళీ, కుమారస్వామి, తాళ్లపల్లి సత్యనారాయణ, రణధీర్, హరిచరణ్, రాజారాం, ప్రతాప్, సతీష్, అనిల్, నాగరాజు, రవి, కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయం పరిశీలన

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని సీతారాంపురంలో గల శ్రీపత్తి ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని గ్రామ సర్పంచ్ అద్దంకి సైదేశ్వరరావు ఏడాది క్రితం తిరుమల తిరుపతి దేవస్థానానికి దరఖాస్తు చేశారు. దీంతో శుక్రవారం టీటీడీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ అధికారిణి నందిని గ్రామానికి వచ్చి ఆంజనేయస్వామి ఆలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వల్లభనేని విజయలక్ష్మి, ఉపసర్పంచ్ జానకిరాములు, వార్డు సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

జగిత్యాల ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రావణిపై వేధింపులకు పాల్పడుతున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పద్మశాలి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి సూర్యాపేట పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి చలమల్ల నర్సింహ మాట్లాడారు. అధికార పార్టీ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికై ప్రజలకు సేవ చేస్తున్న డాక్టర్ బోగ శ్రావణిపై కక్షకట్టారని విమర్శించారు. ఒకే పార్టీకి చెందిన వారైనా బీసీ మహిళ, విద్యావంతురాలు, డాక్టర్‌గా శ్రావణి చురుగ్గా ప్రజల్లో తిరుగుతుండడంతో అసూయతో అవమానించిన సంజయ్‌కుమార్‌పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. బీసీలను రాజకీయంగా ఎదగనివ్వకుండా కేసీఆర్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని, సంజయ్‌కుమార్ అరాచకాలను ఎన్నిసార్లు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా తనవర్గం ఎమ్మెల్యే కావడంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఎమ్మెల్యేపై చర్య తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసంఘాలతో కలిసి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి ఎలగందుల సుదర్శన్, జిల్లా నాయకులు గండు రమేష్, మిర్యాల గోపాలకృష్ణ, దూల నగేష్, బాల్నే మల్లయ్య, చిటిపూలు రమణ, మిట్టపల్లి యుగంధర్, వెంకటేశ్వర్లు, ఉపేందర్, మల్లేష్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వీరమల్లు, పద్మశాలి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్నదర్గా ఉర్సు ప్రారంభం



చిన్నదర్గాకు గంధం ఊరేగింపుగా తీసుకువస్తున్న నాయకులు, ధర్మకర్తలు



దర్గాలో బాబా సమాధిపై చాదర్‌లు కప్పుతున్న నిర్వాహకులు

అర్వపల్లి : మండల కేంద్రం శివారులోని హజ్రత్ ఖాజా నసీరుద్దీన్‌బాబా దర్గా సమీపంలోని సయ్యద్ జాన్‌పాక్ షహీద్ ఖాజామొహినొద్దీన్‌బాబా దర్గా (చిన్నదర్గా) ఉర్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాలల్లో భాగంగా జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, ధర్మకర్త వెన్న శ్రీకాంత్‌రెడ్డి, సాయి నిఖిల్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, ముజావరి హబీబ్‌రెహ్మాన్‌లు పెద్ద దర్గా నుంచి గంధం పాత్రలు, దట్టీలను ఎత్తుకొని చిన్నదర్గా వరకు ఊరేగింపుగా వచ్చి చిన్నదర్గా చుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం చిన్నదర్గాలో బాబా సమాధులకు చాదర్, పూలదండలను సమర్పించారు. అలాగే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా జలాలీబాబా, జహంగీర్ బాబా సమాధులపై కూడా చాదర్‌లు ఉంచారు. ఈ సందర్భంగా ఉర్సుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలోభక్తులు తరలివచ్చి తిలకించారు. కార్యక్రమంలో నిర్వాహకులు షఫీ, రఫీ, జానీ, రబ్బాని, అక్బర్, బషీర్, సయీఫ్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న పులుసు సత్యం

నాగారం : గ్రామీణ ప్రాంతాల్లో 60శాతంపైగా ఉన్న వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పులుసు సత్యం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండలంలోని డి.కొత్తపల్లి గ్రామంలో ఈనెల 29న నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. పేదలకు ఉచిత విద్య, వైద్యం, ఉపాధి కల్పించాలన్నారు. కనీస వేతన చట్టాన్ని సవరించి కొత్త జీఓ విడుదల చేసి, పెరిగిన కూలీరేట్లను గ్రామాల్లో అమలు చేయాలన్నారు. వ్యకాస కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నియోజకవర్గ వ్యాప్తంగా సర్వే చేసి, సర్వేలో గుర్తించిన సమస్యలపై ఫిబ్రవరిలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉద్యమాలు రూపొందించేందుకు ఈనెల 29న సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సంఘం నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడియం కుమార్, జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య, పడమటి రెడ్డి నగేష్, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి, వనం సోమయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్టాలను తుంగలో తొక్కిన బీజేపీ



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

చివ్వెంల : ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధిహామీ చట్టాలను బీజేపీ అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టపల్లి సైదులు ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించి 200రోజులు పనులు కల్పించాలని, ప్రతిరోజు కూలి రూ.200 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బెల్లకొండ వెంకటేశ్వర్లు, బచ్చలకూరి రాంచరణ్, పిచ్చయ్య, సోమయ్య, ఖంపాటి రాములు తదితరులు పాల్గొన్నారు.

మహాదీక్షను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్నమాదిగ

భానుపురి (సూర్యాపేట) : హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఈనెల 30న చేపట్టనున్న అనాథల అరిగోస మహాదీక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్నమాదిగ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాథలకు అండగా ప్రభుత్వం ఉంటుందని చెప్పి సీఎం కేసీఆర్ మాయమాటలు చెప్పి ఏడేళ్లు అవుతుందన్నారు. మంత్రివర్గ ఉపసంఘం ద్వారా సిఫారసులు చేసి అనాథలకు స్మార్ట్ ఐడీకార్డులు, ప్రతి జిల్లాకు ఆశ్రమం, 5శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ నేటికీ నెరవేర్చకుండా అనాథలను సైతం మోసం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులుమాదిగ, నాయకులు గార కనకయ్య, దాసరి వెంకన్న, చెరుకుపల్లి చంద్రశేఖర్, మేడి కృష్ణ, తాటిపాముల నవీన్, చింత వినయ్‌బాబు, చింత సైదులు, నవిలే బద్రి, సతీష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాన్‌పహాడ్ షహీద్‌బాబా దర్గా ఉర్సు



దర్గా వద్దకు గంధం తీసుకెళ్తున్న గోపాలపురం సర్పంచ్ శాసనాల నాగసైదయ్య

హుజూర్‌నగరరూరల్ : హుజూర్‌నగర్ మండల పరిధిలోని గోపాలపురం శివారులో ఉన్న జాన్‌పహాడ్ సైదులు షహీద్ బాబా దర్గా ఉర్సును శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా నుంచి గోపాలపురం దర్గా వద్దకు గంధాన్ని తీసుకొచ్చారు. అనంతరం గంధాన్ని గుర్రంపై ఊరేగింపు నిర్వహించారు. దర్గా వద్దకు ఉమ్మడి జిల్లా నుంచి కులమతాలకతీతంగా భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు షేక్ అమీనాబీ ఖులుల్లీ రహిమాన్, మహమ్మద్, ఎస్‌కే పాషా, హసీనా, సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, ఎంపీటీసీ చీకూరి రాజారావు, యాకూమియా, ఫాతిమూన్, జానీ బేగం, జైనాబీ, హసీనాబేగం, ఫాతిమా, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' వైద్యశిబిరం పరిశీలన

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు వల్లాపురంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఎంపీడీఓ యం.యర్రయ్య, కంటి వెలుగు ప్రత్యేక అధికారి డాక్టర్.కళ్యాణ్‌చక్రవర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతికార్మికుడు లేబర్‌కార్డు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

భానుపురి (సూర్యాపేట) : ప్రతి కార్మికుడు లేబర్ కార్డు తీసుకుని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పొందాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఎలక్ట్రిషియన్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నిషియన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ కార్మికులు అందరూ ఐక్యమత్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు తోట శ్రవణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బ్రహ్మచారి, బిల్డర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వరిపెల్లి శంకర్, నల్లగుంట్ల సందీప్, తాపీపనివారాల సంఘం అధ్యక్షుడు కుర్ర నర్సయ్యయాదవ్, నబీ, బ్రహ్మచారి, మహిమూద్ అలీ, శ్రీనివాస్, సోమయ్య, మధు, విఠల్‌రెడ్డి, యకస్వామి, నాగరాజు, జానకిరామ్, జానయ్య, పరమేష్, యూనియన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'దళిత బంధు' యూనిట్లు ప్రారంభం



కిరాణం దుకాణం యూనిట్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ అనసూయ తదితరులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ చాగంటి అనసూయరాములు కోరారు. శుక్రవారం పట్టణంలోని 8వ వార్డులో కడమంచి ప్రమీల, చంద్రయ్య దళితబంధులో భాగంగా ఏర్పాటు చేసుకున్న కిరాణం దుకాణాల యూనిట్లను ఆమె ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని అన్నారు. మొదటి విడతలోనే మండలం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికకావడంతో లబ్ధిదారులకు ఎంతో మేలు జరిగిందన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న సర్పంచ్ ప్రేమలతవెంకట్‌రెడ్డి

నాగారం : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం స్థానిక సర్పంచ్ పునుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డి అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో చదివే 1నుంచి 5వ తరగతి విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం రాగిజావతో పాటు, డ్రైఫ్రూట్స్ విద్యా సంవత్సరం ముగిసే వరకు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సభ్యులకు సర్పంచ్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వడ్డే మహేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ శీల వీరమల్లు, హెచ్‌ఎం కోదాటి లక్ష్మీనర్సింహారావు, సుధీర్, సోమిరెడ్డి, మధు, రవి, సైదులు, యువజన సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ 'పరీక్షా పే చర్చ'ను వీక్షించిన విద్యార్థులు



కోదాడలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న విద్యార్థులు

కోదాడ : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని కోదాడలోని తేజ టాలెంట్ పాఠశాల, కోదాడ టాలెంట్ స్కూల్ విద్యార్థులు వీక్షించారు. ఆయా స్కూల్‌లలో ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ల ద్వారా మోదీ ప్రసంగాన్ని విన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల నిర్వాహకులు జానకిరామయ్య, బాణాల కోటిరెడ్డి, బీజేపీ నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య, నకిరికంటి జగన్‌మోహన్‌రావు, సాతులూరి హనుమంతరావు, ఒరుగంటి పురుషోత్తమరావు, రవికుమార్, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కోటిరెడ్డికి ప్రముఖుల పరామర్శ



హనుమారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మునగాల : మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన నంద్యాల కోటిరెడ్డి (వికారాబాద్ ఎస్పీ)ని శుక్రవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఈనెల 19న ఎస్పీ కోటిరెడ్డి తండ్రి హనుమారెడ్డి మృతిచెందిన విషయం విధితమే. దీంతో శుక్రవారం రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు తుమ్మలపల్లి భాస్కర్‌రావు, సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణతో పాటు అనంతగిరి మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు గంగూరి సంతోష్, పర్వతనేని సందీప్‌లు హనుమారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోటిరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. సర్పంచ్ నంద్యాల విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ మండల పార్టీ కార్యదర్శి ఎలక వెంకటరెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

- సూర్యనారాయణస్వామి క్షేత్రంలో నేడు ప్రారంభంకానున్న ఉత్సవాలు
- వేడుకల్లో పాల్గొననున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్



రథసప్తమి వేడుకలకు ముస్తాబైన సూర్యక్షేత్రం



సూర్యక్షేత్రం ఎదుట ఏర్పాటు చేసిన సూర్యుడి ఏకచక్రం

అర్వపల్లి : రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన తిమ్మాపురంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా శనివారం ఉదయం క్షేత్రంలో వేడుకలు ప్రారంభంకానున్నాయి. తెల్లవారుజామున స్వామి అలంకరణ, అభిషేకాలతో కార్యక్రమాలు మొదలుకానున్నాయి. ఉదయం సూర్యకిరణాలు స్వామి పాదాలను తాకనుండడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి కిరణాలను తిలకించనున్నారు. అలాగే వివిధ ప్రాంతాల భక్త బృందాలచే భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తమిళనాడులోని మహాబలిపురంలో ప్రత్యేకంగా తయారు చేయించి తెచ్చిన ఏకచక్రాన్నిక్షేత్రం ఎదుట ఏర్పాటు చేశారు. దీనిని శనివారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ప్రారంభించనున్నారు. అలాగే మధ్యాహ్నం అన్న ప్రసాదసత్రంలో అన్నదానాలు నిర్వహించనున్నారు. సాయంత్రం క్షేత్రంలో ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహిస్తారు. అలాగే క్షేత్రంలో రాత్రి వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

బెంగళూరు నుంచి వివిధ రకాల పుష్పాలు..

రథసప్తమి వేడుకలకు బెంగళూరు నుంచి ప్రత్యేకంగా వివిధ రకాల పూలను తెప్పించి క్షేత్రాన్ని అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో రానుండటంతో స్వామి గర్భాలయానికి క్యూలైన్లను కూడా ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి కోరారు.